

కథా కౌముది

# హెచ్చరిక

రవి కొప్పరపు

"Fermi Paradox అంటే ఏంటో తెలుసా, హరి?" అడిగింది కుసుమ, కాఫీ కప్పు బల్ల మీద పెడుతూ.యూనివర్సిటీ క్యాంటీన్ చుట్టూ చెట్ల మధ్య కుర్చీల్లో కూర్చుని ఉన్నారు కుసుమ, హరనాథ్. ఎప్పుడో ఫిజిక్స్ చేస్తున్నప్పుడు ఇలా క్యాంటీన్ కి వచ్చి, అక్కడ వడా పావ్, చాయ్ తాగి స్నేహితులతో సరదాగా గడిపిన రోజులు గుర్తుకు వచ్చి నిట్టూర్చాడు హరి.

"అబ్బా, ఈ ప్రశ్నలేంటి? ఏదో హాయిగా మన కాలేజి లైఫ్ గురుంచి మాట్లాడుతుంటే, ఇదేంటి మధ్యలో? మంచి సినిమా చూస్తున్నప్పుడు వచ్చే ప్రకటన లాగా? సంవత్సరానికెప్పుడో ఒకసారి కలుస్తాం. నువ్వేమో అమెరికాలో, నేను ఇక్కడ ఇండియా లో. ఇద్దరం మన రీసెర్చేదో చేస్తున్నాం అక్కడా, ఇక్కడా. మళ్ళీ పని గురుంచే మాట్లాడుకోవాలా ఆఫీసు బయట కూడా?" విసుక్కున్నాడు హరి.

"విసుక్కోకు..మనమింకా ఫణి, సోనాలి, కోసం ఎదురు చూస్తున్నాం...అంతవరకు కొంచెం దీని గురుంచి మాట్లాడదాం. చెప్పు, Fermi paradox తెలుసా?"

"Fermi ఎవరో తెలుసు.. ఆ paradox ఎంటో తెలీదు" ఎటో చూస్తూ అనాసక్తంగా సమాధానమిచ్చాడు హరి.

"Fermi కి 1938 లో ఫిజిక్స్ నోబెల్ బహుమతి వచ్చింది. ఒకసారి, అంటే 1950 లో, తన కొలీగ్స్ తో ఏదో మాట్లాడుతుంటే గ్రహాంతరవాసులు, అదే అలిఎన్స్, ప్రస్తావన వచ్చింది. తన కొలీగ్సు విశ్వం లో జీవం పుట్టడం సర్వ సాధారణం అని అంటే, అప్పుడు Fermi “Where are they?" అన్నారు. అంటే జీవం అంత సులువుగా సాధ్యం అయితే ఆ ఏలియన్స్ ఎక్కడ? మనకెందుకు ఇంతవరకు కనపడలేదు? అదే paradox. .అంటే మనం అనుకున్నది కాకుండా ఇంకోటి జరగడం. మనం జీవం సాధారణం అనుకుంటున్నాం, కానీ భూమి మీద తప్ప ఎక్కడా కనపడలేదు ”

"నాకు ఆ ఫణి గాడు కనిపించి కూడా చాలా కాలం అయ్యింది. వాడెక్కడ అని నేను కూడా వెతుకుతున్నా. వాడిష్టం ఉన్నప్పుడు కనపడతాడు కానీ నా ఇష్టం ఉన్నప్పుడు కాదు కదా. ఒక వేళ వాడు నాకు ఫోను చేసినా, మెసేజి చేసినా నేను చూడకపోయినా, నా దగ్గర ఫోను లేకపోయినా నాకు వాడి గురుంచి తెలీదు. ఇదీ అంతే. ప్రతీది మనకెప్పుడు కావాలంటే అప్పుడు జరగదు కదా " అన్నాడు హరి.

కుసుమ గట్టిగా నవ్వింది .

"భలే చెప్పావ్. ఇంతవరకు మనం Aliens ఎందుకు కనుక్కోలేదో."

"ఈ మాత్రం దానికి నువ్వు అమెరికాలో Aliens మీద ఏం రీసెర్చి చేస్తున్నావ్?" నవ్వాడు హరి .

"ఎన్నో ఏళ్ల నుండి ఏంతో మంది శాస్త్రవేత్తలు వెతుకుతున్నారు. ఏమిటో ఇంతవరకు ఎవ్వరూ కనీసం Hello కూడా చెప్పలేదు" కుసుమ ఆలోచిస్తూ అంది.

"ఆ ...ఎందుకు చెప్తారు హలో మనకి ? మనమేమంత గొప్ప పనులు చేస్తున్నాం? అడవిలో కౄర మృగాలు ని చూసి హలో చెప్తావా? నోటీసు బోర్డు పెట్టి ఎవ్వరూ ఇక్కడికి రాకండి అని రాసి అందరిని తరిమేస్తాం. అప్పుడు ఆ జంతువులు కూడా అనుకుంటాయేమో ఏంటీ ఎవ్వరూ కనపడట్లేదు అని. అలాంటి బోర్డు మన భూమి మీద వేళ్ళాడుతూ ఉందేమో? మీ NASA శాటిలైట్లు ని చూడమని. " అన్నాడు హరి.

కుసుమ నవ్వి ,

"అబ్బా ...దేనికైనా తిరకాసు సమాధానం ఇస్తావు. నీ రీసెర్చు ఏమైనా గొప్పా? ఏదో రెండు నక్షత్రాలో , బ్లాక్ హోల్స్ ఎక్కడో ఢీ కొట్టుకుంటే, నువ్వు సంబర పడిపోతావు."

"తల్లీ ...నీకు దణ్ణం పెడతా.. మరీ అంత తీసికట్టుగా మాట్లాడకు. ఆ ఢీ కొట్టుకున్న బ్లాక్ హోల్స్ కానీ, నక్షత్రాలు కానీ తరువాత gravitational waves , అంటే గురుత్వాకర్షణ తరంగాలు, పంపుతాయి...ఎక్కడో కొన్ని కోట్ల కోట్ల కిలోమీటర్లు దూరంలో ఉన్నా, ఏది అడ్డం ఉన్నా మేము కనుక్కోగలం. మాహానుభావుడు Einstein మొదట కనుక్కుంటే, మన భారతీయ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్ ఇంకో రకమైన నక్షత్రాలు కనుక్కున్నాడు. మీకు మాత్రం పక్కన Aliens ఉన్నా కనపడరు. "

కుసుమ ఏదో అనబోతుంటే ఫణి, సోనాలి వచ్చారు. ఇంక అందరూ మాటల్లో పడ్డారు.

★★★★★★

దాదాపు సంవత్సరం తరువాత .....

కుసుమ ఆఫీసు లో కొలీగ్స్ తో మాట్లాడుతుంటే, ఫోను రింగయ్యింది. వాట్ సాప్ కాల్. హరి నంబరు. ఇప్పుడేంటి? వాడికి రాత్రి పదయ్యుంటుంది. మామూలుగా ఫోన్లో మాట్లాడుతాంగాని వాడి సాయంత్రం ఏడు, ఎనిమిది తరువాత ఎప్పుడూ మాట్లాడలేదు. ఏమైనా అర్జంటా ? ఏమో, ... అయ్యుండచ్చు.

"ఎక్స్ క్యూస్మి ..ఐ నీడ్ టు టేక్ దిస్ కాల్ ", అని చెప్పి బయటకి వచ్చింది .

"హలో్...ఆ ..హరి..చెప్పు" అంది కుసుమ

"బిజీ గా ఉన్నావా?", హరి అడిగాడు.

"ఆ ...ఎదో మీటింగ్ లే.. అర్జంటా ? అంతా ఫర్వాలేదా?"

"ఆ ...అంతా ఒకే ... నీతో కొంచెం మాట్లాడాలి..మన రీసెర్చి గురించి. ఒకసారి నీ మీటింగ్ అయ్యాక ఫోన్ చేస్తావా?"

'మన రీసెర్చా' ? కుసుమకి అర్థం కాలేదు. నాతో రీసెర్చి పనేంటి వీడికి? మేమిద్దరం అసలు చాలా వేరు రంగాల్లో ఉన్నాము. నేనేమో విశ్వం లో జీవరాశి ఎక్కడుందో కనుక్కునే పని. వాడేమో నక్షత్రాలు గుద్దుకుంటే వచ్చే తరంగాలు కోసం వెతుకుతున్నాడు.

"నాతో పనా? ఏంటి? నీకు నీ రీసెర్చి చేతకావట్లేదా? నా దగ్గర పని చేస్తావా?", నవ్వుతూ అడిగింది.

"నీ దగ్గర కాదు. నీతో పని చెయ్యాల్సిన అవసరం ఉంది. అంతే కాదు, ఒక బయాలజిస్టు కూడా పని చెయ్యాల్సిన అవసరం ఉంటుందేమో. నేనింకా కనుక్కుంటున్నా..అసలు నీ మీటింగు అయినా తరువాత మళ్ళీ ఫోన్ చెయ్యి." అన్నాడు హరి.

బయాలజిస్టా ? అంటే బయాలజీ .....ప్రాణులు గురుంచి తెలిసిన వాళ్ళా? వాళ్ళు వీడికెందుకు? వాళ్లకి నాతో పని...వేరే ప్రాణులు కనుక్కుంటున్నాను కాబట్టి. వీడికి మతి పోయిందా?

"సరే ..మీటింగ్ అయ్యిన వెంటనే చేస్తా... లేట్ అవుతుందేమో నీకు మరి?" అడిగింది కుసుమ.

"ఏం పర్వాలేదు..ఇది చాలా చాలా ముఖ్యం ,,,...నాకే కాదు, నీకు, అందరికీ...ఉంటా " అని ఫోన్ పెట్టేసాడు.

మెల్లగా నడుస్తూ, ఆలోచిస్తూ , అయోమయంగా ఆఫీసులోకి వెళ్లింది. మీటింగంతా అన్యమనస్కంగా నే ఉంది. ఏమర్థం కాకుండా ఉంది. సరే చూద్దాం.

ఒక గంట తరువాత వీడియో కాల్ చేసింది హరి కి. ముందు ఫోన్ తియ్యలేదు. మళ్ళీ చేస్తే , హరి ఫోన్ తీసి వెంటనే తన కంప్యూటరు స్క్రీను చూపించాడు ఏమీ మాట్లాడకుండా. ఏవో డేటా , గ్రాఫులు కనపడుతున్నాయి.

"హలో ..హరి... ఉన్నావా? ఏంటి చూపిస్తున్నావు?" అయోమయంగా అడిగింది కుసుమ.

హరి ఫోను తన వైపు తిప్పి నవ్వుతూ అడిగాడు ..

“కుసుమ ...ఇప్పుడు నిన్ను విసిగించే అవకాశం నాకు. Fermi Paradox అంటే ఏంటో తెలుసా?”

వీడికి నిజంగా పిచ్చి పట్టింది.

“పిచ్చెకిందా? ఇందుకా అంత అర్జంటుగా ఇందాక ఫోన్ చేసావ్?” విసుక్కుంది కుసుమ.

“అద్ది ....ఇప్పుడు అర్థం అయ్యిందా నువ్వెంత విసిగిస్తావో?” నవ్వుతూ అన్నాడు హరి.

“బాబు ...నీకు రాత్రి అయ్యి ఆఫీసు మూసేసి పన్లేకపోతే ఎదో దిక్కుమాలిన సినిమా చూసో , ఎదో చేసి టైం పాస్ చెయ్యి. మా పని చెడగొట్టద్దు. ఇంక ఉంటా ...బై “..

“ఆ... ఆ ...ఆగు..ఆగు. ఈ గ్రాఫు చూస్తున్నావా? ఇది అర్థం అవుతోందా?” మళ్ళీ చూపించాడు స్క్రీన్.

మరీ అర్థం కాకపోయినా , వాడి పని గురుంచి కొంచెం తెలుసు కాబట్టి చూస్తే తెలిసింది.

“ఆ .. ఎదో తరంగాల డేటా ... ఏం గుద్దుకున్నాయి మళ్ళీ ? బ్లాక్ హోల్స్ ? నక్షత్రాలా? లేదా నువ్వే చూసుకోకుండా వెళ్లి నీ టెలిస్కోపుని ఢీ కొట్టావా? ఏదైనా గుద్దుకోవడం, బద్దలవ్వడం అయితే తప్ప నీకు ఆనందం ఉండదు. “ అంది కుసుమ.

“అవి బ్లాక్ హోల్స్ కావు, నక్షత్రాలు కావు, నేనసలు కాదు. ఉద్యోగం ఊడేది నేనైతే.”

“మరి...గ్రహాలూ ఢీ కొట్టిన డేటానా?”

“ఛాన్సే లేదు..గ్రహాల గురుత్వాకర్షణ తరంగాలు (gravitational waves) అసలు చాలా , చాలా చిన్నవి. ఇంత పెద్ద తరంగాలు కావు “ హరి అన్నాడు.

ఆలోచిస్తూ అంది కుసుమ...

“మరేంటి? ప్రకృతి లో ఉన్న తెలిసిన వస్తువులు కావు... మనకి తెలియనివి ఏమో?“

“అది కూడా అనుకున్నాం.. అసలు ఈ గ్రాఫు చూడు. ప్రకృతిలో ఏ వస్తువూ సహజ సిద్ధంగా ఇలాంటి తరంగాలు పంపదు.” అన్నాడు హరి.

“మరి.. అసహజంగా .....” కుసుమ ఆగింది.. నుదుట మడతలు పడ్డాయి.

“ఏ.. ఏంటి ..నువ్వంటుంది ?? ఏమంటున్నావ్??” అప్రయత్నంగా అంది మళ్ళీ ... నమ్మబుద్ధి కాని ఆలోచన మెదడుకు వస్తోంది.

“ప్రకృతి పంపట్లేదు ఈ గురుత్వాకర్షణ తరంగాలని. అంటే, ......... వేరే ఎవరో పంపుతున్నారు” అన్నాడు హరి కెమెరా ముందు వంగి..

కుసుమ విస్తుపోయింది అంటే.. అంటే--- ఎలియన్సా ? ఛా --- నో. ...గురుత్వాకర్షణ తరంగాలని పంపే ఏలియన్స్ ? అస్సలు కాదు. అసలు గురుత్వాకర్షణ తరంగాలు పంపాలంటే ఏ నక్షత్రాలో , బ్లాక్ హోల్స్లో కావాలి--- అంత శక్తి , అంత పెద్ద వస్తువులు కావాలి. వీడేంటి ఇలా అంటున్నాడు? ఎదో తప్పు డేటా అయ్యుంటుంది---

"నువ్వు డేటా సరిగ్గా చూసుకున్నావా? ఎదో తప్పు చేసుంటావ్ " అనుమానంగా అడిగింది. ఇప్పుడు అర్థం అయ్యింది తనకెందుకు ఫోన్ చేసాడో .

"చూడమ్మా...నేనే కాదు, నా ల్యాబ్ లో అందరూ చూసారు. సమస్యే లేదు...ఖచ్చితంగా ఎవరో పంపారు."

కుసుమకి ఒక్క సారిగా ఒళ్ళు జలదరించింది. తాను వింటోంది అర్థం అవ్వడానికి , జీర్ణించుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తోంది. మానవ చరిత్రలో మొట్ట మొదటి సారిగా ఎవరో మనకి భూమి బయట నుండి "హలో " చెప్పారు. అది కూడా మామూలుగా కాదు. వాళ్ళు మన సెల్ ఫోన్ లు వాడే తరంగాలు ఉపయోగించలేదు. అంటే రేడియో వేవ్స్ వాడలేదు. కాంతిని , వెలుతురు ని కూడా వాడలేదు. X-ray లు వాడలేదు.

కేవలం గురుత్వాకర్షణ తరంగాలు మాత్రమే వాడారు--- ప్రకృతిలో అత్యంత శక్తిమంతమైన వస్తువులు ఇచ్చే తరంగాలు వాడారు. ఈ తరంగాలని ఎక్కడా ఏదీ అడ్డుకోలేవు...ఏది అడ్డం వచ్చినా నిశ్చింతగా దాని నుండి దూసుకెళ్ళిపోతాయి. అందుకే ఈ తరంగాలు వాడారేమో. అంటే ఎంత టెక్నాలజీ ఉంటుంది వాళ్ళకి అంత శక్తి తయారు చెయ్యడానికి ? మన టెక్నాలజీ వాళ్ళ ముందు ....అసలు టెక్నాలజీ నే కాదు.

వాళ్ళు తలుచుకొని ఉంటే ఈపాటికి మనల్ని , మన భూమిని క్షణంలో భస్మం చెయ్యగలరు. కానీ చెయ్యలేదు. కేవలం హలో అనిపించే సంకేతం పంపారు. ఏదో పెంపుడు జంతువు కి బిస్కెట్ వేసినట్టుగా ---

"హలో .......హలో--- ఈ లోకంలోకి రావమ్మా ", హరి మాటలు వినిపిస్తున్నాయి.

తనను తాను సముదాయించికొని అంది కుసుమ ,

"ముందు కంగ్రాచులేషన్స్.. ఎప్పుడూ దేన్నీ సీరియస్ గా తీసుకోని నువ్వు ఇలాంటి అద్భుతమైన ఆవిష్కరణ చేస్తావని ఎప్పుడూ అనుకోలేదు. చాలా సంతోషంగా ఉంది. " అంది కుసుమ .

"థాంక్యూ.. నా మీద అంత నమ్మకం ఉన్నందుకు. నీ Fermi paradox కి సమాధానం దొరికింది కదా? " నవ్వుతూ అన్నాడు హరి.

సాలోచనగా తలూపింది..ఇంకా నమ్మకం కలగట్ల.

మళ్ళీ అన్నాడు హరి

"మర్చిపోయాను చెప్పడం..ఈ డేటా ఎక్కడ నుండి వస్తోందా తెలుసా ?"

"కొన్ని లక్షల కోట్ల కిలోమీటర్ల నుండి అయ్యిండచ్చు. ఎక్కడో దూరంగా వేరే నక్షత్రం చుట్టూ ఉండే గ్రహం నుండి రావాలిగా ఈ తరంగాలు" అంది కుసుమ.

"హ హ.. ఆశ్చర్యపడే విషయం చెప్పనా? ఈ తరంగాలు జస్ట్ మన సౌరకుటుంబం అంచుల నుండి వస్తున్నాయి" అన్నాడు హరి

అదిరిపోయింది కుసుమ. సౌరకుటుంబం అంచులు?? అక్కడెవరున్నారు? అసలు ఈ సౌరకుటుంబం లో మనం తప్ప బుద్ధి జీవులెవరూ లేరు. ...లేరనే ఇప్పటిదాకా అనుకున్నాం. అంత దగ్గర నుండి గురుత్వాకర్షణ తరంగాలా ?? అంటే.. ఎవరో ఎక్కడి నుండో వచ్చి పని గట్టుకొని మనకు దగ్గరగా ఈ తరంగాలు పంపుతున్నారా? ఆ తరంగాలు పంపడానికి ఏదో అంతరిక్ష నౌక ఉండే ఉంటుంది అక్కడ. ఇంత దూరం అంతరిక్ష నౌక లో వచ్చి మరీ మనకు సంకేతాలు పంపాలా? వాళ్ళ గ్రహం నుండే పంపచ్చు కదా, కేవలం హలో చెప్పడానికి ? ఏంటో ....వాళ్ళ ఉద్దేశం అస్సలు అర్థం కావటం లేదు.

"అవును....సరేకానీ ..ఇంతకీ ఏమైనా మెసేజీ ఉందా డేటాలో? లేదా ఉత్తి తరంగాలేనా?" అడిగింది కుసుమ.

"అందుకే నీకు ఫోన్ చేశా..ఇది నీకు సంబంధించింది కూడా కాబట్టి , నువ్వు కూడా ఇక్కడకి వచ్చి మాతో పాటు కొంత కాలం పని చేస్తే అసలు మెసేజి ఉందొ లేదో కనుక్కోవచ్చు. ...ఏంటి వస్తావా?" అడిగాడు హరి.

ఆలోచించింది కుసుమ.

"కొంచెం టైము పడుతుంది. చాలా పేపర్ వర్కు పెట్టాలి. కానీ అవుతుంది. ఇప్పుడే మొదలు పెడతా "

"ఓకే ...! అయితే మళ్ళీ మనం మన క్యాన్ టీన్ లో ఇంతకు ముందు లాగా రోజూ కలవచ్చన్నమాట. మంచిది. "

"ఒకే ...ఉంటా మరి..మళ్ళీ కంగ్రాచులేషన్స్..!" అంది కుసుమ.

★★★★★★

ఇంకొక సంవత్సరంన్నర తరువాత .... హరి ల్యాబ్ లో ..

"అబ్బా ...ఇప్పటికి ఏడు నెలల నుంచి తలలు బద్దలు కొట్టుకుంటున్నాం...ఆ చివరి డేటా ఏంటో అర్థం కావట్లేదు. అదొక్కటే మిగిలింది " హరి విసుగ్గా అన్నాడు.

ఆలోచిస్తూ అంది కుసుమ..

"ఆ డేటా ...చాలా సింపుల్ గా ఉంది.. మనం మరీ ఓవర్ గా ఆలోచిస్తున్నామేమో?"

పక్కనే ఉంది కార్లీ స్మిత్ ..తాను వివిధ భాషల్లో స్పెషలిస్టు.

"అది అసలు భాష కాదేమో...వాళ్ళ సంఖ్యలేమో? అంటే మనకు ఒకటి, రెండు..ఎలాగో అలాగన్న మాట"

బల్బు వెలిగింది హరి కి.

"కరెక్ట్.. అవి నంబర్లు అయ్యుండచ్చు .." అని పరిగెత్తి కెళ్ళి కంప్యూటర్ లో ఏదో టైపు చేసాడు. ఏదో చేస్తోందది. కొంచెం సేపయ్యాకా ముక్కలు, ముక్కలు గా మన భాషలో పదాలు రావడం మొదలయ్యాయి. అందరూ ఆతృతగా చూస్తున్నారు., కంప్యూటరు ఏం డీకోడ్ చేసిందో అని.

మొట్ట మొదటి పదం ..... "హెచ్చరిక "

మొహాలు చూసుకున్నారు అందరూ.

"సరిగ్గా టైపు చేసావా , హరి?" అడిగింది కుసుమ.

అవునన్నట్టు తలూపాడు హరి. కంప్యూటరు ఇంకా పని చేస్తోంది.

"మనకి హెచ్చరికా?" ఎవరో అన్నారు.

'హలో ' అని మెసేజి వస్తుందనుకుంటే ఇదేంటి? ఎందుకో కుసుమ మనసులో అనుమానం. మెల్లగా పెద్దదవుతోంది.

కంప్యూటర్ ఇప్పుడు గబా గబా మెసేజి ప్రింటు చేస్తోంది. అది చదువుతున్న అందరి మొహాలు లో ఆనందం లేదు. ఆత్రుత లేదు, భయం కూడా లేదు. విచారం మాత్రమే కనపడుతోంది. ఆ విచారం లో కొంచెం ఏదో తప్పు చేస్తే వచ్చే సిగ్గు కూడా ఉంది.

హరి మెల్లగా అన్నాడు కుసుమ తో ..

"సో .... నీ Fermi paradox కి సమాధానం దొరికింది. ఇంతవరకు ఎవ్వరూ మనకి హలో ఎందుకు చెప్పలేదు అని . సిగ్గు పడాల్సిన విషయం ఏంటంటే, ఈ మెసేజి కూడా మన కోసం కాదు. మిగతా అందరి ఏలియన్స్ కి పంపారు. ఇంతకంటే అవమానం మనకేముంటుంది?"

తలూపింది కుసుమ,

"ఇది మనముండే అడవికి హెచ్చరిక నోటీసు బోర్డు".

అందరూ కంప్యూటర్ వంకే చూస్తూ ఉండిపోయారు.

"హెచ్చరిక. ఆటవిక జాతి జీవులుండే ప్రదేశం. గెలాక్సి రక్షణ సంధి ద్వారా నియంత్రించబడింది. దగ్గరికి రావద్దు."

★★★

# COMMENTS